## బీఆర్ఎస్‌లో చేరికలు

ఉట్నూర్, అక్టోబర్18 : ఉట్నూర్ మండల కేంద్రంలోని బోయవాడ కాలనీకి చెందిన మహిళలు బుధవారం బీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మహిళలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలకు భద్రతపరంగా, పండుగల పరంగా చాలా ప్రధాన్యమిస్తున్నామన్నారు. బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించి, పండుగ పూట ఆడబిడ్డలకు చీరలు అందిస్తున్న ప్రభుత్వం కేసీఆర్‌దేనన్నారు. ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కందుకూరి రమేశ్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, కార్యకర్తలు, మహిళా నాయకులు ఉన్నారు.

# నిర్భయంగా ఓటు వేయాలి

- నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- కడెం జడ్పీ పాఠశాలలో 'స్వీప్'


కడెం : మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కడెం, అక్టోబర్ 18 : నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. కడెం మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో బుధవారం నిర్వహించిన సిస్టమెటిక్ ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ అండ్ ఎలక్టోరల్ పాటిసిపేషన్ (స్వీప్) కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని కడెం, ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్ మండలాలకు సంబంధించిన కార్యక్రమాన్ని డీఆర్డీవో ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. మండల పరిస్థితులను తహసీల్దార్ రాజేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి కడెం ప్రాజెక్టు సమీపంలో గల సంపద వనాలను సందర్శించారు. కడెంలో రెండు సంపద వనాలను ఏర్పాటు చేయగా, అందులో నాటిన పలు రకాల మొక్కలను పరిశీలించారు. అక్కడి నుంచి మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆయన, ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్వీప్ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేశారు. అలాగే ప్రత్యేక ఓటర్ నమోదుకు సంబంధించిన ప్లకార్డులను అధికారులతో కలిసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అనే విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని సూచించారు. అలాగే 30వ తేదీ వరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా 18 ఏండ్లు నిండిన యువతీయువకులను ఓటర్లుగా చేర్పించేలా బీఎల్వోలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో వివిధ శాఖల అధికారులు సమన్వయంగా పనిచేసి, వందశాతం ఓటు హక్కు వినియోగించేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. స్వీప్, బతుకమ్మ సంబురాలను డీఆర్డీవో ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, ఈజీఎస్, ఐకేపీ, ఐసీడీఎస్ సిబ్బంది చేసిన ఏర్పాట్లపై ఆయన అభినందించారు. అనంతరం అధికారులు, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ప్రజలకు బతుకమ్మ, దేవీ నవరాత్రులు, దసరా శుభాకాంక్షలు తెలిపారు. మొదటిసారి కడెం మండలానికి వచ్చిన కలెక్టర్‌కు మండల అధికారులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవోలు వెంకటేశ్వర్లు, సుధాకర్ రెడ్డి, మల్లేశం, విజయభాస్కర్‌రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీవో సరిత, ఏపీవో జయదేవ్, ఎంపీవోలు ఉపేందర్, రత్నాకర్‌రావు, ఏపీవోలు జయదేవ్, రవిప్రసాద్, రమేశ్, రాజన్న, ఏపీఎంలు రాజారాం, గంగారెడ్డి, గంగాధర్, బోజన్న, నాలుగు మండలాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఈజీఎస్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

### వారంలోగా సీఎంఆర్ఎఫ్ బియ్యం అందించాలి

నిర్మల్ టౌన్, అక్టోబర్ 18 : జిల్లాలో పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో రైస్‌మిల్లులకు కేటాయించిన ధాన్యానికి సంబంధించిన సీఎంఆర్ఎఫ్ బియ్యం వారంలోగా అందించాలని, లేకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి సీఎంఆర్ఎఫ్ బియ్యంపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 2022-23 పంట కాలానికి సంబంధించిన బియ్యానిన 12 బయిల్డ్ రైస్ మిల్లులకు, 46 రైస్‌మిల్లులకు రా రైస్ మిల్లర్లకు కేటాయించడం జరిగిందన్నారు. నిర్ణీత గడువులోగా అందించాలని, ఎన్నోసార్లు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. జిల్లాలో రైస్‌మిల్లర్లు 1,12,678 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు 23,891 మెట్రిక్ టన్నులు మాత్ర ఇచ్చారన్నారు. యాసంగికి సంబంధించిన 1,58,666 మెట్రిక్ టన్నుల బియ్యంకు గాను ఇప్పటివరకు 1,06,844 మెట్రిక్ టన్నులు ఇచ్చినట్లు వెల్లడించారు. వారంలోగా ఇవ్వాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. పెండింగ్‌లో ఉన్న రైస్‌మిల్లర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో అలీ, డీఎం శ్రీకళ, అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించుకోవాలి

- నిర్మల్ జిల్లా విద్యుత్ శాఖ అధికారి జయంత్‌రావ్ చౌహాన్


అవగాహన కల్పిస్తున్న జయంత్‌రావ్ చౌహాన్

సోన్, అక్టోబర్ 18 : గృహ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించుకోవాలని నిర్మల్ జిల్లా విద్యుత్ శాఖ అధికారి జయంత్‌రావ్ చౌహాన్ సూచించారు. నిర్మల్ మండలం కొండాపూర్ గ్రామంలో బుధవారం విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లింపుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించుకోవడం ద్వారా ఎలాంటి ఇబ్బందులు ఉండవని, సమయ భావం మిగులుతుందని తెలిపారు. ఆన్‌లైన్ బిల్లుల చెల్లింపుపై అన్ని గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మొబైల్ నుంచే వారికి సంబంధించిన ఇంటి సర్వీసు నంబర్ ఆధారంగా బిల్లు చెల్లించుకునేందుకు వినియోగదారులకు ఇది మంచి అవకాశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ నాగారాజు, ఏడీఈ రంగస్వామి, ఏఈ కిశోర్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చాటిన విద్యార్థులతో కోచ్‌లు

ఉట్నూర్, అక్టోబర్ 18 : వరంగల్ వేదికగా 34వ దక్షిణ భారత అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో ఉట్నూర్ ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ అండర్-14 విభాగంలో జావెలిన్ త్రోలో పెందూర్ సతీశ్ కుమార్ 54.63 మీటర్ల దూరం విసిరి జాతీయ స్థాయిలో రికార్డు బద్దలుకొట్టాడు. ఇదే పాఠశాలకు చెందిన మరో విద్యార్థి కొడప పరుశురాం 600 మీటర్ల పరుగు పందెంలో రజత పథకం సాధించాడు. వీరు పేద కుటుంబాలకు చెందిన వారేనని ఉపాధ్యాయులు తెలిపారు. అనంతరం విద్యార్థులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ ఉత్తం, ఉపాధ్యాయుడు మెస్రం గంగారాం, ప్రభాకర్, మాధవ్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పారా మిలటరీ దళాలకు బస ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ, తదితరులు

భైంసా, అక్టోబర్ 18 : పట్టణంతో పాటు ముథోల్ మండలంలో పారామిలిటరీ దళాల బస ఏర్పాట్లను బుధవారం అధికారులు పరిశీలించారు. ముందుగా ముథోల్‌లోని గిరిజన పాఠశాల, భైంసాలోని మినీ స్టేడియాన్ని సందర్శించారు. అంతేగాకుండా ఈవీఎంలను ఉంచేందుకు స్ట్రాంగ్ రూమ్‌లను సైతం పరిశీలించారు. ఇందులో ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఆర్డీవో కోమల్ రెడ్డి, ఆయా మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాలి

ఉట్నూర్, అక్టోబర్ 18 : దంతన్‌పల్లి గ్రామైఖ్య సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌కు బుధవారం ఆయన నివాసంలో సభ్యులు వినతిపత్రం అందించారు. ఈ మేరకు జడ్పీ చైర్మన్ స్పందిస్తూ.. రైతులకు నష్టం జరుగకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మర్సుకోల తిరుపతి, దావుల రమేశ్, జాడే నర్సయ్య, సమైఖ్య సభ్యులు విజయలక్ష్మి, తారా, సంతోషమ్మ పాల్గొన్నారు.

## దుర్గమ్మకు పూజలు..


బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 18 : నిర్మల్ పట్టణలోని ఆర్యవైశ్య సంఘ భవనంలో కొలువుదీరిన దుర్గామాత మండపంలో బుధవారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాల్గో రోజు అమ్మవారికి ఇష్టమైన నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మహిళలు బతుకమ్మ ఆడారు. సాంప్రదాయ నృత్యాలు చేశారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 18 : సారంగాపూర్ మండలం స్వర్ణ గ్రామంలో పీడీఎస్ బియ్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో బుధవారం తనిఖీకి వెళ్లగా, అబ్దుల్ సోహేల్ ఇంట్లో 12 కిలోల బియ్యం లభించినట్లు పోలీసులు తెలిపారు. బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 18 : ఆదిలాబాద్ పట్టణంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ డీ సాయినాథ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ నగర్ సమీపంలోని చెరువు కట్ట వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకొని, వారి నుంచి రూ.5410 నగదు, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పట్టుబడ్డ వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-320501-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677